వాయిస్ టుడే
జనగొంతుక - మునోనేత్రం
హైదరాబాద్
సోమవారం, 20 జనవరి, 2025

# గెలుపు ముంగిట మల్క కొమరయ్య..?



## ఆదిలాబాద్- నిజామాబాద్ - మెదక్ - కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన బీజేపీ

- ఈ జిల్లాల పరిధిలోనే ఆ పార్టీ ఎంపీలు నలుగురు..
- మొత్తం 8 మంది ఎమ్మెల్యేల్లో ఏడుగురు ఇక్కడివారే
- కేంద్ర మంత్రి బండి సంజయ్, అర్వింద్ పూర్తి అండ..
- మెదక్‌లో రఘునందన రావ్ రూపంలో బలమైన మద్దతు
- ఆదిలాబాద్ గిరిజనులంతా కాషాయ పార్టీ వైపునే
- ఉత్తర తెలంగాణలో బలమైన సామాజిక వర్గం మున్నూరు కాపు కావడం
- కొమరయ్యకు మరింత వెన్నుదన్ను
- తపస్, ఆర్ఎస్ఎస్ తోడ్పాటుతో గెలుపు ఖాయం..?
- నిజామాబాద్ కు పసుపు బోర్డు మంజూరుతో వీరతిలకం

వాయిస్ టుడే, హైదరాబాద్ ప్రతినిధి

సాధారణ నేపథ్యం నుంచి అసాధారణంగా ఎదగడం అంటే..? పుట్టిన ప్రాంతాన్ని మరవకుండా సాయం చేయడం అంటే..? ఒక వ్యక్తి ఒక వ్యవస్థగా మారడం అంటే..? తాను చదువుకోవడమే కాక.. చదువు విలువను గుర్తించి విద్యా దానం చేయడం అంటే..? ఇదంతా అసాధారణ వ్యక్తిత్వం ఉన్నవారికే సాధ్యం అవుతుంది. అలాంటి వారే విద్యావేత్త, పారిశ్రామికవేత్త మల్క కొమరయ్య.

### ఆశించినది దక్కకున్నా..

ఎవరైనా ఆశించినది అందకుంటే నిరుత్సాహానికి గురవుతారు. కొందరు మాత్రమే మరో అవకాశం ఎక్కడుందా? అని వెదుక్కుంటారు.. మల్క కొమరయ్య అదే చేశారు. గత ఏడాది నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గం బీజేపీ టికెట్ రేసులో కొమరయ్య పేరు ప్రముఖంగా వినిపించింది. అన్ని సమీకరణాలు ఆయనకే అనుకూలంగా ఉండడంతో కొమరయ్యదే టికెట్.. ఆయన ఎంపీగా గెలిచి 'మల్కా'జిగిరి కొమరయ్య మారడం ఖాయం అని ఓ దశలో భావించారు. కానీ, అనూహ్య పరిస్థితుల్లో టికెట్ మరో నాయకుడికి వెళ్లింది. అయినప్పటికీ కొమరయ్య వెనకడుగు వేయలేదు. బీజేపీ పట్ల తన అభిమానాన్ని వదులుకోలేదు. ఫలితంగానే ఆయనకు ప్రస్తుతం ఆదిలాబాద్- నిజామాబాద్ - మెదక్ - కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం దక్కింది.

### విద్యావేత్తకు విద్యాధికుల టికెట్

సాధారణ వ్యక్తి అసాధారణ వ్యక్తిత్వం అని చెప్పుకొనే మల్క కొమరయ్య ప్రముఖ విద్యావేత్త. ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ వ్యవస్థాపకులు. విద్యారంగంలో దశాబ్దాల అనుభవం ఆయన సొంతం. దీంతో ఆదిలాబాద్- నిజామాబాద్ - మెదక్ - కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో కొమరయ్య వైపే బీజేపీ అధిష్ఠానం మొగ్గుచూపింది. ఓ విధంగా చెప్పాలంటే విద్యారంగ సమస్యలపై అవగాహన, సేవాగుణం, నిరాడంబరుడైన కొమరయ్యకు దక్కిన గుర్తింపు ఇది.

### ఉద్యమాల గడ్డ కరీంనగర్‌లో జననం

మల్క కొమరయ్య ఉద్యమాల గడ్డ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందినవారు. 1959 అక్టోబరు 1న ప్రస్తుత పెద్దపల్లి జిల్లా బంధంపల్లిలోని పేద వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. అప్పన్నపేటలో పదో తరగతి వరకు చదివారు. ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటూ కరీంనగర్ లో ఇంటర్ పూర్తి చేశారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ పట్టా పొందారు. ప్రఖ్యాత ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

### ఘనమైన ప్రాజెక్టులు నిర్మించి..

ఓయూలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన కొమరయ్య.. తాను చదువుకున్న విద్యను ఆచరణలో పెట్టారు. రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీ అంటే ఎవరికీ తెలియని 1980ల్లోనే ఆయన అసాధారణ ప్రాజెక్టులు చేపట్టారు. సివిల్ ఇంజనీరింగ్ లో అద్భుతాలను పరిచయం చేశారు. ఇప్పుడు హైదరాబాద్ ఐకాన్ గా పేర్కొంటున్న మినర్వా కాంప్లెక్స్, జూబ్లీహిల్స్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్, మహేంద్రహిల్స్ ధనలక్ష్మీ కాలనీ, మాదాపూర్ లో పల్లవి ఎన్ క్లేవ్, సికింద్రాబాద్ లోని భువన టవర్స్ వంటి ఎన్నో ఇంజనీరింగ్ అద్భుతాలను కొమరయ్య సృష్టించారు. ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లో కూడా ఆయన ఎన్నో ప్రాజెక్టులు చేపట్టడం విశేషం.










### రాజకీయ నేపథ్యం..

విద్య, వైద్య రంగంలో ఎన్నో సేవలు అందించిన మల్క కొమరయ్య.. ప్రజలకు మరింత దగ్గరగా సేవ చేయాలని రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై.. బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర నాయకుడిగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఆశించిన మల్క కొమరయ్య.. చివరి వరకు ప్రయత్నం చేసి.. అధిష్టానం విజ్ఞప్తి మేరకు బీజేపీ రాష్ట్ర నాయకులు ఈటల రాజేందర్ కు మద్దతు ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ గడ్డ మీద ఆయన వేసిన మొదటి అడుగు నుంచి నేటి వరకు ఆయన ఎక్కడా వెనక్కి తగ్గలేదు.

### అవార్డులు..

కొమరయ్యను వివిధ రంగాల్లో ఎన్నో అవార్డులు వరించాయి. మానవ హక్కుల కోసం చేసిన కృషికి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. అవార్డులు.. కొమరయ్యను వివిధ రంగాల్లో ఎన్నో అవార్డులు వరించాయి. మానవ హక్కుల కోసం చేసిన కృషికి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు.

### బలమైన స్థానంలో బలమైన అభ్యర్థి

మల్క కొమరయ్యకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడం ద్వారా బీజేపీ బలమైన స్థానంలో బలమైన అభ్యర్థిని నిలిపిందనే పేరు తెచ్చుకుంది. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉండగా వీరిలో నలుగురు ఈ ప్రాంతం (మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్) వారే. అంతేగాక 8 మంది ఎమ్మెల్యేల్లో ఏడుగురు ఇక్కడివారే. దీన్నిబట్టే మల్క కొమరయ్యకు విజయావకాశాలు మెండుగా ఉన్నాయని స్పష్టం అవుతోంది.

### అభ్యర్థి ప్రకటనలో ముందున్న బీజేపీ

ఆదిలాబాద్- నిజామాబాద్ - మెదక్ - కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎంతోమంది పోటీపడినా బీజేపీ నేరుగా మల్క కొమరయ్యకు ఖరారు చేసింది. దీంతో మిగతా పార్టీల కంటే ముందంజలో నిలిచింది.

### కలిసిరానున్న సామాజిక వర్గం అండ

మల్క కొమరయ్య బీసీ మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందినవారు. ఉత్తర తెలంగాణలో మెదక్ నుంచి మొదలుపెట్టి ఆదిలాబాద్ వరక ఈ సామాజిక వర్గం ప్రబలంగా ఉంది. కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఈ సామాజిక వర్గం వారే. మరోవైపు ఆదిలాబాద్ లో పాయల్ శంకర్ కూడా మున్నూరు కాపు కులం వారే. దీంతో సొంత సామాజిక వర్గం నుంచి కొమరయ్యకు భారీ మద్దతు దక్కడం ఖాయం. ఈ స్థానంలో మున్నూరు కాపులకు టికెట్ రావడం అరుదు కావడమే దీనికి కారణం.

### 'పసుపు' శుభపద్రం.. దన్నుగా బీజేపీ క్యాడర్

ఉత్తర తెలంగాణలో బీజేపీ బలంగా ఉంది. భారీగా ఉన్న బీసీ టీచర్ల ఓటు బ్యాంకు కొమరయ్య వైపు మళ్లనుంది. బీజేపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం తపస్.. పూర్తిస్థాయిలో రంగంలోకి దిగితే మిగిలేది గెలుపే. కాగా, ఇటీవలే నిజామాబాద్ ప్రజల చిరకాల వాంఛ అయిన పసుపు బోర్డు మంజూరైంది. నిజామాబాద్ ఎంపీ పట్టుదల, కేంద్ర ప్రభుత్వం చొరవతోనే ఇది సాధ్యమైంది. ఇది కొమరయ్యకు మరింత సానుకూల వాతావరణం ఏర్పరచనుంది.

### విద్యావేత్తగా

హైదరాబాద్‌లో 1994లో పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ను స్థాపించి దశాబ్దాలుగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహెూత్తరమైన యజ్ఞాన్ని కొనసాగిస్తున్నారు. పల్లవి మోడల్ స్కూల్స్, పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఫ్రాంచైజ్ లను తీసుకొని ఆ బ్రాంచ్ లను సిటీ నలుమూలలా విస్తరించారు. నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టి మరెంతో మంది స్టూడెంట్లను మేధావులుగా మార్చి సమాజానికి అందించారు. కొమరయ్య వద్ద విద్యనేర్చుకున్న ఎంతో మంది స్టూడెంట్స్ ఇప్పుడు దేశంలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ప్రఖ్యాత అడ్వకేట్లు, డాక్టర్లు, సైంటిస్టులుగా దేశానికి సేవలందిస్తున్నారు.

### ఆరోగ్య సేవలు..

స్వతహాగా సేవా గుణం కలిగిన కొమరయ్య.. పేదలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించేందుకు నాచారంలో ప్రసాద్ హాస్పిటల్స్ ను ప్రారంభించారు. నిత్యం వెయ్యి మంది వరకు ఈ హాస్పిటల్స్ లో సేవలు పొందుతున్నారు. అంతేకాకుండా హాస్పిటల్ కు కూడా రాలేని స్థితిలో ఉన్న పేదల కోసం ఆయన మరొక అడుగు ముందుకు వేసి.. పేదల బస్తీల్లోనే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తూ.. వైద్య సేవలు అందిస్తున్నారు. ఇలా ఏటా నిర్వహించే వందలాది హెల్త్ క్యాంప్స్ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

### ప్రకృతి ప్రేమికుడిగా..

పర్యావరణ పరిరక్షణ కోసం మల్క కొమరయ్య.. ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏటా లక్షలాది మొక్కలు నాటుతున్నారు. ప్లాస్టిక్ భూతం యావత్తు ప్రపంచాన్ని భయపెడుతున్న నేపథ్యంలో.. డీఆర్డీవో టెక్నాలజీతో 'ఎకో భారత్' అనే ప్లాంట్ నెలకొల్పి భూమిలో తేలిగ్గా కలిసి పోయే డీగ్రేడబుల్ కవర్స్ తయారు చేస్తున్నారు. లాభాపేక్ష లేకుండా పర్యావరణ హితమే ధ్యేయంగా ఆ కవర్లను మార్కెట్ కు అందిస్తున్నారు. వ్యవసాయ, ఇతర వ్యర్థాల నుంచి పవర్ జనరేట్ చేసేందు కోసం ఆయన 'శాలివాహన గ్రీన్ ఎనర్జీ'ని నెలకొల్పారు.

### తెలంగాణ వాదిగా..

చరిత్రలో తెలంగాణ ఉద్యమానిది చెరగని సంతకం. స్వరాష్ట్రం కోసం తెలంగాణ సబ్బండవర్గాలు రోడ్డెక్కి కొట్లాడారు. నిఖార్సైన తెలంగాణ వ్యక్తిగా మల్క కొమరయ్య.. తెలంగాణ ఉద్యమంలో అన్ని సమయాల్లో అండగా నిలిచారు. పలు సభలు, వేదికలపై ప్రజా యుద్ధ నౌక గద్దర్ లాంటి వారు అత్యంత ఆప్యాయంగా స్పందిస్తూ.. "కొమురన్న లాంటి వాళ్ళు మన తెలంగాణలో ఉండటం అదృష్టం" అనేవారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మల్క కొమరయ్య కృషిని గద్దర్ మాటల ద్వారా అర్థం చేసుకోవచ్చు.

